# (అ)జ్ఞాని

## కథ

మెచ్యూరిటీ-పాదరసం లాంటిది. దాన్ని ఏ వయసు పాత్రలో పోస్తే ఆ ఆకారాన్ని సంతరించుకుంటుంది. ఇంతచిన్న విషయం తెలీని నేను ఏ వయసులో మెచ్యూరిటీని అదే 'అల్టిమేట్' అనుకుంటూ కొన్నిసార్లు నా ఆలోచనలను సమర్ధించుకుంటూ కొన్నిసార్లు రాజీపడిపోతూ ఇన్నాళ్లూ, ఇన్నేళ్లూ గడిపేశాను.

ఏం రాయాలో తెలీకుండా మొదలుపెట్టి ఏం రాశామో తెలీకుండా ముగించేస్తే అదో అద్భుతమైన ప్రేమలేఖ అవుతుందట. ఆడదాని సమక్షంలో మగాడికి క్షణాల్లో ప్రేమ పుట్టుకొస్తుందని నాకప్పట్లో తెలీదు. తెలిశాక ప్రేమమీద నాకున్న అభిప్రాయాలతో ఓ ఉత్తరం రాశాను. రాసి ఆమెకిచ్చాను.

పట్టుకుంటే పాలుగారే పరువం, నునుసిగ్గుల ఎరుపెక్కిన బుగ్గలతో తలవంచుకుని నిశ్శబ్దంగా నవ్వుతున్న పదహారేళ్ల పడుచుపిల్లా, కన్నెపిల్లకు కాదు నేనా ఉత్తరాన్నిచ్చింది.

అప్పటికే-పెళ్ళై ఇద్దరు పిల్లలున్న ఓ స్త్రీ మూర్తికి. రెండ్రోజుల తర్వాత దానికి రిప్లయ్ వచ్చింది.

''ప్రేమ-అభౌతికమైనదీ, అలౌకికమైనదీ, మహిమాన్వితమైనదీ..నువ్వు నాకంటే పెద్దదానివని తెలుసు. పరాధీనవనీ తెలుసు. సమాజపు కట్టుబాట్ల గురించిగానీ, నీతి నియమాల గురించిగానీ, నైతిక విలువల గురించిగానీ, తప్పొప్పుల ప్రసక్తి గురించిగానీ నేనిక్కడ ప్రస్తావించబోవడం లేదు. నిన్ను చూశాక నా మనసు ఫీలయిన అనుభూతిని రాస్తున్నానంతే. ఐ లాస్ట్ మై హార్ట్ ఇన్‌ది ప్రెజెన్స్ ఆఫ్ యు. హౌ కెన్ ఐ రీ గెయిన్, ప్లీజ్ టెల్‌మీ..'' ఇవీ నా మొదటి ప్రేమలేఖలోని వాక్యాలు.

దాదాపు ఇరవై ఎనిమిది సంవత్సరాల ఒక స్త్రీ మరో కుర్రాడ్ని ఎందుకు ఇష్టపడుతుందో కూడా తెలుసుకోలేనంత అమాయకమైన ఆలోచనలతో నేను మొదటి రెండు సంవత్సరాలూ ఆమెను పవిత్రంగానే చూశాను. మూడో సంవత్సరంలో అందులోని 'అంతరార్థం' గ్రహించగలిగాను.

చీకటి పడ్డాక-సముద్రం ఒడ్డున ఇసుక తెన్నెల మీద కూర్చుని సముద్రం మీదినుండి చల్లని గాలి వీస్తుంటే-ఆ గాలికి పరవశించిపోతూ...కాదు పట్టపగలే వాళ్లింట్లో ఆమె భర్తలేని సమయంలో మేం కలుసుకున్నాం. బుద్ధుడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయమైనట్టు 'ఎజాక్యులేట్' అయిన రెండు నిమిషాల తర్వాత నాకు ఓ సత్యం తెలిసింది.

''కోట్లు కోట్లు డబ్బు సంపాదించడంలోనూ, కొత్తగా ఒక వస్తువును సృష్టించడంలోనూ, ప్రపంచమంతా మనల్ని గుర్తించాలంటే మనం పొందాల్సిన స్థానం పొందినా కూడా కలగని ఆనందం-మనకు నచ్చిన మనల్ని మెచ్చిన ఓ అమ్మాయిని అందునా వివాహితను రహస్యంగా అనుభవించడం వల్ల కలుగుతుంది'' అని.

మనిషికి థ్రిల్ యిచ్చినంత ఆనందం మరేదీ ఇవ్వదు. ఒకపని చేసినపుడు అందులోని 'నిజమైన' ఆనందం మనకి తెలిస్తే మళ్లీ ఆ పని చేయకుండా ఉండటానికి మనం చాలా కష్టపడాలి. ఒకసారి ఆమెతో అనుభవాల్ని పంచుకున్నాక అందులో థ్రిల్లేంటో నాకు తెలిసింది. ఆ తర్వాత అవకాశం దొరికినప్పుడల్లా మేం కలుసుకునేవాళ్లం. విచిత్రం ఏంటంటే, అది తప్పని నాకు తెలుసు. తప్పని తెల్సికూడా చేయకుండా ఉండలేని పరిస్థితి.

ఒక పని లేదా ఒక వస్తువు ఒక వయసులో యిచ్చే ఆనందం, అదే పని లేదా అదే వస్తువు కొన్నిరోజుల తర్వాత 'అంతే' ఆనందం యివ్వకపోవచ్చు. 'థీరీ ఆఫ్ కన్‌జమ్‌షన్' అంటే ఇదే!! పదహారేళ్ల అమ్మాయికిగానీ, అబ్బాయికిగానీ ప్రేమంటే గొప్ప థ్రిల్. అదే ప్రేమ వాళ్లకి ఇరవై ఒకటవ సంవత్సరంలో 'అంతే' థ్రిల్ యివ్వకపోవచ్చు. దురదృష్టవశాత్తూ నాకు అలాంటి అనుభవం నా ఇరవై ఒకటవ సంవత్సరంలో కలిగింది-ఆమె ద్వారా. అయితే, గుప్పిట మూసి ఉన్నంత కాలమే అందులో ఏముందో తెలుసుకోవాలన్న తపన కలుగుతుంది. చివరికి అందులో ఏమీ లేకపోయినాసరే. మొదట్లోనే గుప్పిట తెరచి అంతా చూపిస్తే అదెంత అద్భుతమైనదైనా అంత ఆసక్తినివ్వదు. అన్నిసార్లు ఆమెను అంతా చూశాక మళ్లీ ఆమెను చూడటానికి ప్రత్యేకంగా ఏమీ మిగిలిలేదు. ఏ వస్తువుమీదైనా అంతే. మొదట్లో ఇష్టం చాలా ఉంటుంది. రానురానూ క్రమంగా తగ్గుతుంది.

ఒకప్పుడు ఆమెకు ఉత్తరం రాసివ్వాలంటేనే సంబరపడే నేను, ఆ తర్వాత అది చాలా మామూలైపోయింది. 'అలౌకికమైనదీ, మహిమాన్వితమైనదీ' అని నేననుకున్న ప్రేమ (ఆమె గురించి అంతా తెలిశాక) కాలం గడుస్తున్నకొద్దీ నాకంత గొప్పగా కన్పించలేదు. అంటే ఒకప్పటి నా బేసిక్ అభిప్రాయాలకీ ప్రస్తుత నా మెచ్యూరిటీ అభిప్రాయాలకీ 'రెలెవెన్సీ'లో తేడా వచ్చిందన్నమాట.

ఒక స్త్రీని ఆకర్షించడానికి కావలసిన అర్హతలన్నీ నాలో ఉన్నాయన్న విషయం కొన్నాళ్లు నా 'మేల్ ఇగో'ను తృప్తిపరచిన మాట నిజమే. కానీ ఆ ఒక్కటే నన్నంతగా కట్టిపడెయ్యలేకపోయింది. నాక్కావలసింది 'అదొక్కటే' కాదు. ఏదో కావాలి! ప్రపంచమంతా నిద్రిస్తున్న అర్ధరాత్రి వెండి వెన్నెల్లో తామరపూవు వికసిస్తుంటే నిశ్శబ్దంలో ఆ శబ్దం వినాలనీ, ప్రాతఃకాలం కొలనుగట్టున కూర్చుని నిద్రగన్నేరు పూవు వికసిస్తుంటే చూడాలనీ, సాయంకాలం నీరెండలో సరుగుడు చెట్ల మధ్య కూర్చుని క్షణకాలమైనా నన్ను నేను మరచిపోవాలనీ..ఏదో కావాలి!!! తనువు కాదు మనసు మైమరచిపోవాలి. మనిషి పంచే 'మెకానికల్ హాపీనెస్' కాదు.

ఆ సమయంలోనే నా డిగ్రీ అయిపోయింది. పై చదువులకోసమని మా ఊరినీ, ఆమెనూ వదిలి పట్నం వెళ్లాను.

★★★

ఓ రోజు ఆఫీస్‌లో-

''గుడ్మార్నింగ్ సర్'' అని వినబడేసరికి ఆ అసిస్‌మెంట్ ఇయర్‌కి సంబంధించిన ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ చెక్ చేస్తూన్న నేను తలెత్తి చూశాను.

ఎదురుగా శ్రీధర్! అతను మా ఆఫీసులో ఆర్టికల్ క్లర్క్. చేతిలో ఏదో ప్యాకెట్టుంది. ''గుడ్మార్నింగ్'' నేనూ విష్ చేశాను.

అతను నా దగ్గిరకొచ్చి ప్యాకెట్ విప్పి అందులోంచి స్వీటు తీసి నాకు యిస్తూ అన్నాడు. ''సర్. మూణ్ణెల్ల క్రితం ఓ వీక్లీలో కథల పోటీకి నేనూ ఓ కథ పంపాను. దానికి రెండవ ప్రైజు ఐదువేలు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది సర్. డబ్బు గురించి కాదుగానీ నా కథలోని థీమ్ ప్రైజ్ గెల్చుకున్నంత స్థాయిలో ఉన్నందుకు ఆనందంగా ఉంది.''

స్వీటు తీసుకుంటూ ''కంగ్రాట్స్'' అన్నాను.

అతను చెప్పుకుపోతున్నాడు.

''దాదాపు సంవత్సరం క్రితం నేను ఈ ఆఫీసులో చేరినపుడు నాకేమీ తెలిసింది కాదు. ఆ తర్వాత మీలోని డిసిప్లిన్, కాంప్రహెన్సివ్‌నెస్, ఓ సమస్య గురించి మీరాలోచించే విధానం..ఇవన్నీ నేనూ నేర్చుకునేలా చేశాయి. అంతకంటే గొప్ప విషయం ఏంటంటే మీరు రచయిత కావడం..మొదట చెప్పిన డిసిప్లిన్, కాంప్రహెన్సివ్‌నెస్..ఇవేమీ మీ గొప్పదనాన్ని చూపించేవి కావు ఎదుటి మనిషి మీతో కలిసి చాలాకాలం పనిచేస్తే తప్ప. కానీ ఒక రచయితగా మీ పేరు పుస్తకాలలో చూసి మీరెంత గొప్పవారో తెలుసుకోగలిగాను. మిమ్మల్ని చూసి ఇన్‌స్పయిర్ అయ్యాను. అందుకే నా కథకు బహుమతి వచ్చినా ఆ క్రెడిట్ అంతా మీకే దక్కుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే రచనల్లో నేను మీకు ఏకలవ్య శిష్యుణ్ణి''

ఒక స్టూడెంట్ ఒక టీచర్‌తో ఏ విషయం ఎంతవరకు ఎలా మాట్లాడాలో కూడా ఆలోచించకుండా అతను మాట్లాడేస్తున్నాడు. బహుశా అతడు నామీద తనకున్న అభిమానాన్ని చాటుకోవడానికి ఇదే సరైన సిట్యుయేషన్‌గా భావించి ఉండాలి. అయితే ఆ సమయంలో నా స్థానంలో మరెవరున్నా అతని మాటలకు సంతోషపడేవారేమో! కానీ నాకలా అన్పించలేదు. అసూయగా ఉంది. అంతకంటే ఎక్కువగా అసంతృప్తి.

''ఐదారునెల్ల క్రితం ఓ కథ రాసి మీకు చూపిం



చాను. ప్రకృతికి జరిగే ప్రతి చిన్న అన్యాయం పట్లా తీవ్రంగా స్పందించే భావాలున్న ఓ వ్యక్తి గురించి. దాన్ని చదివి ఫర్వాలేదన్నారు. గుర్తుందా సర్''

గుర్తులేదు. కానీ అలా చెబితే బావోదు.

''అవును గుర్తుంది'' అన్నాను ముఖం మీదకి నవ్వును తెచ్చుకుంటూ.

''ఫర్వాలేదన్న 'ఫేజ్' నుంచీ 'ఎక్సలెంట్' స్థాయికె దగాలని చాలా ప్రయత్నించాను. శైలీ శిల్పం బాగా రావడానికి మీర్రాసిన ఒక్కోకథా ఎన్నిసార్లు చదివానో నాకే గుర్తులేదు. అలా యింప్రూవ్ చేసుకున్నాను సర్. ఇంత చేసినా యిదంతా పార్ట్‌టైమ్‌గానే. రెగ్యులర్‌గా నా స్టడీస్ కంటిన్యూ అవుతూనే ఉన్నాయి''

అతడు చెప్పడం ఆపి నావైపు చూశాడు.

గర్వం, ఈర్ష్య ఈ రెంటిలో ఏ ఒక్కటీ రెండవదాన్ని డామినేట్ చేస్తే ఆ డామినేట్ చేసిన భావాన్ని మనం ముఖంలో వ్యక్తపరచవచ్చు. కానీ నాకు రెండూ సమపాళ్ళలో ఉన్నాయి. ఎలా వ్యక్తపరచాలి? నన్ను చూసి అతను పొందిన స్ఫూర్తికి 'ఒక వ్యక్తిని ఇన్‌స్పయిర్ చేసేంత గొప్పగుణం' నాలో ఉన్నందుకు గర్వపడాలా? నన్ను ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని చివరికి నన్నే ఓడిస్తే దానికి ఈర్ష్యపడాలా?

''నీ కథ ప్రింటయిన వీక్లీ తెస్తావా?'' అన్నాను ఆత్రంగా అది ఆఫీసవర్ అని తెల్సినా కూడా. ఎదుటి మనిషి గురించి పూర్తిగా తెలుసుకుంటే అందులో కనీసం ఒక్క మైనస్ పాయింట్ అన్నా కన్పించకపోతుందా అన్న కుతూహలం. సగటు మానవుడి మనస్తత్వం.

సాయంకాలం ఆర్టికల్ క్లర్క్‌లు, ఆడిట్ క్లర్క్, ఆఫీస్ బాయ్ అందరూ వెళ్లింతర్వాత ఆ వీక్లీ తీశాను. 'అతని కథ ప్రింటవకపోతే బావుణ్ణు. ఒకవేళ ప్రింటయినా ప్రైజ్ రాకపోతే బావుణ్ణు' అనుకుంటూ.

కానీ, ఎలా అయితే బావుంటుందనుకున్నానో అలా జరగలేదు.

పేజీలు తిరగేస్తుంటే ఓ చోట 'కథల పోటీలో రెండవ బహుమతి రూ.5000/- పొందిన కథ' అని అతని పేరూ పరిచయం ఉన్నాయి. పక్క పేజీలో 'పోటీల ఫలితాలు' ఉన్నాయి. ఆత్రంగా వెదికాను.

ఉహు...నా పేరు లేదు.

ఉదయం నుంచీ కొద్దో గొప్పో అసంతృప్తిగా ఉన్న నాకు నా పేరు పత్రికల్లో లేకపోగా అతని కథతోపాటు ఫోటో చూసి తారాస్థాయికి చేరుకుంది. 'నేనెలా అయినా ఫర్వాలేదు. ఎదుటి మనిషి నన్ను డామినేట్ చేయకూడదనుకునే క్రూయల్ మెంటాలిటీ. ఎందుకనో, ఎవరిమీదో చాలా కోపంగా కసిగా ఉంది.

నా కథ ప్రింటవకపోయినా పర్లేదు. ప్రింటయిన అతని కథలో నేను విమర్శించగలిగే పాయింటు ఒకటైనా

**-సడ్డా సుబ్బారెడ్డి**

దొరికితే చాలు. నేను విమర్శించను అది వేరే సంగతి. విమర్శించగలిగే పాయింట్ దొరికితే నా 'అహం' తృప్తిపడుతుంది.

ఆత్రంగా కథ చదవటం మొదలుపెట్టి పూర్తిచేశాను. ఊహు..లాభం లేదు. ఒక్కటీ దొరకలేదు.

'వైవాహిక జీవితంలో పిల్లలు లేక, భర్త నిరాదరణకు గురైన ఓ స్త్రీ మానసిక సంచలనం' కథా సారాంశం. కథ పూర్తిగా చదివాక అన్పించింది 'ఇంత చిన్న వయసులోనే ఇలాంటి థీమ్ తీసుకుని ఫాంటసైజ్ చేసి దాన్ని ఇంత బాగా ప్రజెంట్ చేయగలిగాడంటే భవిష్యత్తులో అతనో చేయి తిరిగిన రచయిత అవుతాడని' శత్రువు మీదకి యుద్ధం చేయడానికెళ్లి అతని మంచితనం చూసో, గుణాలు నచ్చే మన శిబిరం ఎత్తేసి అతని కూటమిలో చేరడం లాంటిదయింది నా పరిస్థితి.

ఎపుడో ఆర్నెల్ల క్రితం ఓ కథ తీసుకుని వస్తే చదివి బావుందని చెప్పాను. మార్చుకోవలసినవీ చెప్పాను. ఆ తర్వాత అతని గురించి పూర్తిగా మర్చిపోయాను. మళ్లీ ఇన్నిరోజుల తర్వాత అతను నా దగ్గరకు యిలా వస్తాడని ఊహించలేకపోయాను.

పావుగంట తర్వాత ఆత్మపరిశీలన మొదలైంది. అసలు నా అసంతృప్తికి కారణమేంటి?

ఎపుడైనా ఒక కథ రాసి పత్రిక్కి పంపిస్తే దానిలో ఏదో లోపం వల్ల తిరిగొస్తే నా కథను అర్థం చేసుకోగలిగేంత బ్రాడ్‌మైండ్ వాళ్లకు లేదనుకుని సంతోషపడే మూర్ఖత్వం వల్లో, రాసిన కథను ఫ్రెండ్స్‌కు చూపిస్తే వాళ్లిచ్చే కాంప్లిమెంట్స్‌కే కడుపునిండితే "నాక్కావలసింది అది కాదు ఒక ఎడిటర్‌ను ప్రభావితం చేయగల రచనా చాతుర్యం" అని తెలుసుకోలేక రాసిందాన్ని చదువుకుని నా శైలికి నేనే మురిసిపోతూ, నా భుజం నేనే తట్టుకుని 'అహం'గా ప్రవర్తించడం వల్లో, సి.ఏ.గా ప్రొఫెషన్‌లో స్థిరపడ్డాక వృత్తిపరంగా బిజీ కావడంతో కథల గురించి ఆలోచించేంత సమయం లేకపోవడం వల్లో..తెలీదుగానీ మొత్తానికి తప్పు నాదేనని తెలిసినా మనసు ఒప్పుకోవట్లేదు.

ఇపుడతని కథకు బహుమతి వచ్చినందువల్లా, నాకు రానందువల్లా ఫీలవుతున్నాగానీ ఒకవేళ అతనితోపాటు నా కథకూ బహుమతి వచ్చి ఉంటే అపుడు తృప్తిగా ఉండేవాణ్నా? ఊహు..అపుడు ఆలోచనలు మళ్లీ ఇంకోలా సాగేవి. నాకు మూడో బహుమతి వచ్చి ఉంటే మొదటిది రావాలనుకుంటాను. మొదటిదే వస్తే నా సుపీరియారిటీ సురక్షితంగా ఉండాలంటే అతనికి అసలు బహుమతే రాకూడదనుకుంటానేమో. కాబట్టి నా యీ అసంతృప్తికి కారణం కూడా సరిగ్గా తెలీడం లేదు. ఆలోచించేకొద్దీ విచిత్రంగా అన్పించింది నాకు. కారణమేమీ లేకుండా అసంతృప్తిగా ఉండటం.

అరగంట గడిచాక ముసురుతున్న ఆలోచనలతో, నిర్లిప్తంగా ఇంటికి బయలుదేరాను.

శ్రీమతి కాఫీ ఇచ్చింది. తాగాక డ్రాయింగ్ రూమ్‌లో చంటిగాడు: చెక్కుచెదరని కాన్‌సన్‌ట్రేషన్‌తో ఏదో గీస్తుంటే వాడిదగ్గరికెళ్ళాను. నేవ్రాయడం వాడు గమనించలేదేమో..యథా ప్రకారంగా ఏదో బొమ్మ వేస్తున్నాడు. వాణ్ణి మాట్లాడించాలా? వద్దా? అని క్షణం తటపటాయించి-వాడి నెత్తిమీద చెయ్యేసి నిమిరాను. వాడు తలెత్తి నావంక చూశాడు. నేను నవ్వాను. ఎందుకో తెలీదుగానీ మనసుకి చాలా రిలీఫ్‌గా అన్పించింది. అంతలో వాడన్నాడు.

"డాడీ! స్కూల్లో ఆర్ట్ కాంపిటీషన్ కండక్ట్ చేశారు డాడీ. నేనూ పార్టిసిపేట్ చేశా. బాడ్‌లక్. నాకు ప్రైజ్ రాలేదు" వాడి కంఠంలో ఈర్ష్య, అసూయ, బాధ, అసంతృప్తి లాంటివేమీ అన్పించలేదు. మామూలుగా ఉన్నాడు. ఎన్నో అనుభవాలనెదుర్కున్న నాకే పక్క మనిషి నన్ను మించిపోతుంటే 'ఇగో' దెబ్బతింది. అలాంటిది వీడేఫీలింగూ లేకుండా ఎలా ఉండగలుగుతున్నాడు. ఆ విషయమే అడిగాను.

"ఏమ్మా! నీకు ప్రైజ్ రానందుకేమైనా బాధపడుతున్నావా?" అని. 'పడటం లేదుకదా' అని ఎదుటి మనిషికి అర్థం అయ్యేట్టు. 'నిజంగా బాధలేదా?' అని నేననుకుంటూ.

"బాధెందుకు డాడీ. మొదట్లో ఫీలయ్యా. కానీ తర్వాత ఆలోచించా. సునీల్‌కి ఆర్ట్ కాంపిటీషన్‌లో ప్రైజ్ వచ్చింది. నాకు రాలేదు. క్లాసులో ఫస్ట్‌మార్క్ నాది. వాడు పూర్. వాడికి ఆర్ట్ 'లైక్' అయితే నాకు చదువు 'లైక్'. వాడికిష్టమైనదాంట్లో వాడు ఫస్ట్. నాకిష్టమైన దాంట్లో నేను ఫస్ట్. చదువులో వాడికంటే నేను బెటర్ అని నేను సంతోషపడ్డాను. ఆర్ట్‌లో నన్ను చూసి వాడు సంతోషపడి ఉంటాడు. ఇంత చిన్న విషయానికి బాధెందుకు డాడ్. నేనూ పార్టిసిపేట్ చేశా. అదే శాటిస్‌ఫాక్షన్ నాకు. నెక్స్ట్ టైం యింకా బాగా ట్రై చేస్తా."

ఎక్కడో-హిమాలయాల్లో ఏళ్ల తరబడి తపస్సు చేసి ఒక ముని కనుగొన్న సత్యం-వచ్చీరాని మాటలతో ఆలోచించడం కూడా సరిగ్గా తెలీని వయసులో వాడు చేసిన ఎనాలిసిస్, "వాడు కూడా నన్ను చూసి సంతోషపడి ఉంటాడు" అన్న వాడి ఆలోచనలోని మరోకోణం నాకు అలాంటి సత్యాన్నే నేర్పాయి. ఇంత చిన్న విషయం నాకు తెలీదని కాదు. తెలిసీ ఎలా ఉండగలుగుతాం అనేది ప్రశ్న. జవాబు దొరికింది. "మనం చేసే ఏ పనికైనా కమిట్‌మెంట్ అవసరం. ఒక పనిని ఇన్‌వాల్వ్ అయి చెయ్యడం వేరు. తప్పదుగాబట్టి చెయ్యడం వేరు. చేసేపనిని ఇన్‌వాల్వ్‌మెంట్‌తో చేస్తే దానికి ప్రైజ్ వచ్చిందా? రాలేదా? అనేవి చాలా అల్ప విషయాలుగా తోస్తాయి. కేవలం మన కమిట్‌మెంటే మనకు నిజమైన సంతోషాన్నిస్తుంది- నాకొడుకు చెప్పింది అదే!!!"

అప్పటివరకూ ఉన్న ఆలోచనలు, అర్థం పర్థంలేని అసూయా మబ్బుల్లా తేలిపోయి హృదయం తేలికైంది. అయితే నేననుకున్నట్టుగా ఇలాంటి భావాలు అంత తొందరగా నాలోంచి వెళ్లలేదు.

★★★


కొంచెం పాత సినిమా కావడం వల్ల థియేటర్‌లో జనాలు పెద్దగా లేరు. ఈ సినిమా చూడాలని శ్రీమతి పట్టుపట్టడం వల్ల రావాల్సొచ్చింది. సీట్లో కూర్చున్న ఐదు నిమిషాల తర్వాత సినిమా ప్రారంభమైంది. సిస్టర్ సెంటిమెంట్. దర్శకుడు సన్నివేశాల్ని బాగానే రక్తికట్టించాడు. ఇంటర్వెల్‌లో కూల్‌డ్రింక్స్ కోసమై లేచాను. దూరంగా ఓ జంట. ఆమె అటు తిరిగి నవ్వుతుంది.

డ్రింక్స్ తీసుకొస్తుంటే అప్రయత్నంగా చూపు మళ్లీ ఆవైపుకే మళ్లింది. తెరచిన తలుపు సందులోంచి వెలుగుపడి ఆ వెలుగులో ఆమెవరో స్పష్టమయింది.

ఆమె-ఆమే!!!

క్షణం ఫఠాలున పగిలి వేయి వ్రక్కలైనట్టూ, ఓ కెరటం బలంగా తీరాన్ని ఢీకొన్నట్టూ అచేతనుణ్ణయ్యాను. శరీరంలోని రక్తమంతా ఘనీభవించినట్టు మెదడు ఆలోచించడం మానేసింది. క్షణం నన్ను నేను కంట్రోలు చేసుకోవడానికి చాలా కష్టపడాల్సొచ్చింది. శ్రీమతికీ, చంటాడికీ కూల్‌డ్రింక్స్ యిచ్చి కుర్చీలో కూలబడ్డాను. కాసేపటి తర్వాత సినిమా తిరిగి ప్రారంభమైంది. చూపు తెరవైపుంది. ఆలోచనలు ఆమెతో ఒకప్పటి నా అనుభవం దగ్గరున్నాయి.

"ఏవండీ" శ్రీమతి పిలుపుకి తేరుకుని చూస్తే తెరమీద శుభం కార్డుంది. బయటికొస్తూ యథాలాపంగా అటువేపు చూస్తే వాళ్లు లేరు. ఆమె గురించి తలుచుకొన్నకొద్దీ అసహనం పెరిగిపోతోంది. తనిక్కడికెందుకొచ్చినట్టు? ఫ్యామిలీ షిఫ్ట్ అయ్యిందా? లేదా ఎవరితోనైనా 'సరదా' కోసమేనా? అప్పటికీ ఇప్పటికీ తన 'అభిరుచుల్లో' మార్పేమీ లేదా! తనకింకా అసలు 'మెంటల్ మెచ్యూరిటీ' రాలేదా? ఏది మంచో



ఏది కాదో అనే ఆలోచన ఆమెకిప్పుడూ వచ్చి ఉండదా?

రెండ్రోజులు ప్రతిక్షణం ఆ ఆలోచనలే వెంటాడాయి నన్ను. తల దువ్వుకుంటున్నా, అన్నం తింటున్నా, చివరికి పెన్‌లో ఇంకు పోసుకుంటున్నా కూడా..తనెందుకొచ్చినట్టు యిక్కడికి? ఫ్యామిలీ షిఫ్ట్ అయ్యిందా? లేదా ఎవరితోనైనా...ఇక మూడోరోజు ఉండబట్టలేక హేమప్రసాద్‌కి ఫోన్ చేశాను. వాడు నా ఫ్రెండ్.

ఎప్పుడైనా మనసు బాలేనపుడు, శ్రీమతితో కూడా చెప్ప(కూడ)ని విషయాలు ఏవైనా నన్ను బాధిస్తుంటే వాడిదగ్గరకెళితే పరిష్కారం చెబుతాడు. అలా అని వాడేమీ సైకాలజిస్ట్ కాదు. ఎం.సి.ఏ కంప్లీట్ చేసి 'సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్' పెట్టాడు. సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ చేస్తుంటాడు. వాడిదంతా 'ఇంటర్నేషనల్' వ్యవహారం గాబట్టి సైకాలజీ బుక్స్ ఎక్కువగా చదువుతుంటాడు.

సరిగ్గా ఇరవై నిమిషాల తర్వాత-వాళ్లింట్లో వాడి 'పర్సనల్ రూమ్'లో వాడికి నా గురించి మొత్తం వివరంగా చెప్పి చివరగా అడిగాను ''తన ఇరవై ఎనిమిదో ఏట నాకు ఇరవై ఒకటి. అప్పుడు మేం మొదటిసారిగా కలుసుకున్నది. ఇప్పుడు నాకు ఇరవై ఎనిమిది. ఇన్ని సంవత్సరాల్లో ఆమె అభిప్రాయాల్లో మార్పేమీ లేదా? అన్నది నాకనవసరం. తన గురించి ఆలోచిస్తే నాకేం బాధగా లేదు. తనెవరితో తిరిగినా అడిగే హక్కు నాకు లేదు. ఆలోచించాల్సిన అవసరం అంతకన్నా లేదు. కానీ ఏదో బాధగా ఉంది. అది బాధ కాదు. దేన్నో కోల్పోతున్నానన్న ఫీలింగ్. నామీద నాకే అసంతృప్తిగానూ, అయిష్టంగానూ, ఎవరిమీదో చాలా కోపంగానూ కసిగానూ ఉంది. ఎందుకు. ఎందుకు అలా అన్పిస్తుంది''

అంతా విన్నతర్వాత వాడు నవ్వాడు నిశ్శబ్దంగానే. నవ్వి చెప్పాడు-

''ఒక స్త్రీలోని సున్నితత్వం అంతా నీకు తెలిసి ఇక కొత్తగా చూడటానికి ఆమెలో ఏమీ మిగిలిలేదన్న భావం నీలో పెరిగాక ఆమె మీద నీకు మొదట్లో ఉన్న ప్రేమ(?) సాంద్రత క్రమంగా తగ్గిపోతున్న దశలో నువ్వు ఊరొదిలి వెళ్లిపోయావ్. నీ కెరీర్ విషయంలో పడి నువ్వా సంగతిని దాదాపు పూర్తిగా మరిచిపోయావు. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత మరెవరితోనో ఆమెను చూశావ్. నీ స్థానాన్ని మరొకడు ఆక్రమించడం నీకు కోపం తెప్పించింది. ఒక వ్యక్తిని మరో వ్యక్తి ఎక్కడ డామినేట్ చేసినా భరించగలడేమో కానీ స్త్రీ దగ్గర మాత్రం అలా భరించలేడు. ఇలాంటి సమయంలో ఆమెను చంపెయ్యాలన్నంత కోపం నీకు రావాలి. అలా రాలేదంటే నీలో ఏదో లోపం ఉన్నట్టు''

థాంక్ గాడ్. నాక్కోపం రావడం తప్పు కాదన్నమాట. సోఫాలో వెనక్కి ఆనుకుంటూ వాడు చెబుతున్నాడు.

''ఒకప్పటి నీ వస్తువు చాలా విలువైంది ఫ్రీ ఆఫ్ కాస్ట్‌లో వచ్చింది. ట్రై చేస్తే ఇపుడూ దాన్ని పొందగలవేమో అది వేరే సంగతి. ఒకప్పుడు నీది కాబట్టి ఇపుడూ నీదేననుకుంటున్నావ్. నీదని నువ్వనుకుంటున్నదాన్ని మరెవడో నీ కళ్ళముందే తీసికెళ్ళిపోతుంటే దాన్ని చూసి నీకసూయగా ఉంది.

అతడు కూడా నాలాంటివాడేనేమో ననుకున్నావ్ కాసేపు. తృప్తి కలగలేదు. అయినా ఆమెవరు! నా చెల్లా! పెళ్లమా? ఆమాటకొస్తే మామధ్య ఏ సంబంధమూ, బంధుత్వమూ లేదే. తనెవరితో తిరిగితే నాకేంటి! అనుకున్నావ్ కాసేపు. అయినా నీ 'ఇగో' తృప్తి పళ్లేదు.

ఎందుకిలా జరుగుతుందని నీలో నువ్వే తర్కించుకున్నావ్. అప్పటికీ సమాధానం దొరకలేదు. ఫలితంగా అయిష్టం పెరగసాగింది. నువ్ చూసిన వాళ్లిద్దరిమధ్యా సెక్స్ ఉండటానికి ఎంత ప్రాబబిలిటీ ఉందో, అది లేని కేవలం 'స్నేహం' మాత్రమే ఉండటానికి కూడా అంతే ఛాన్సుంది. ఆమె నీతో ఉన్నప్పుడు నువు చేస్తున్నది తప్పని నీకనిపించలేదు. ఒకవేళ అలా అన్పించినా అందులోని థ్రిల్ మిస్సవటం నీకిష్టంలేదు.

ఆమెపట్ల నీకున్నది ప్లేటోనిక్ లవ్ అనీ, కానీ సెక్స్ లేని ప్రేమ శాశ్వతంగా నిలబడదనీ నీ ఆలోచనలను సమర్థించుకున్నావ్-ఇపుడు మరో వ్యక్తి ఆమెకు తన ప్రేమ పంచుతుంటే అది ప్రేమకాదనీ, కేవలం సెక్సేననీ నువ్వు భావిస్తున్నావ్. అలా నిజంగా నువు భావిస్తూ ఉంటే నీలో గిల్టీ, ఇన్‌ఫీరియారిటీ ఉందన్నమాట. నిన్నూ నీ అనుభవాన్నీ మరిచిపోయిందేమోనన్న ఇన్‌ఫీరియారిటీ. ఆమెనూ, ఆమె పంచిన అనుభవాన్నీ నువు మర్చిపోగాలేంది నిన్నూ నువ్విచ్చిన అనుభూతినీ ఆమె మరిచిపోవడంలో తప్పేముంది? ఒక పని నువ్వు చేస్తే తప్పు కానప్పుడు, అదే పని ఎదుటి వ్యక్తి చేసినపుడు తప్పెలా అవుతుంది?

ఒక వస్తువు మీద నీకు మోజు తీరి వదిలేశాక, వేరెవరో దాన్ని తీసుకుని వాడుకుంటుంటే ఆ వాడుకుంటున్న వ్యక్తి మీదా, వాడి సామర్థ్యం మీదా నీకు ఈర్ష్య. ప్రస్తుతం అతనికున్న స్థానం ఇపుడు నీది కాకుండాపోతున్నందుకు అసూయ. ఆమె గురించి నాకేం బాధగా లేదని నువు పైకి చెప్పినా ఆమెను మిస్ అవుతున్నందుకు లోపల నీకు చాలా బాధగా ఉంది. నువ్వు ఒప్పుకోకపోయినా ఇది నిజం.''

వాడు తన అభిప్రాయాలను చాలా నిక్కచ్చిగా, కఠినంగా చెబుతున్నాడు.

అంతేమరి రోగి జబ్బును బట్టేగదా డాక్టర్ మందిచ్చేది. వాడు చెబుతున్నది అర్థం చేసుకుంటుంటే నాగురించి నాకే వింతగా అన్పిస్తుంది. అయినా నాగురించేమీ పట్టించుకోకుండా వాడు చెబుతూనే ఉన్నాడు.

''అభిరుచులూ, అభిప్రాయాలూ నీకున్నట్లే అందరికీ ఉంటాయి. తమ నమ్మకాల్నీ, సిద్ధాంతాల్నీ వదులుకుని ఎవరూ నీ దారికి రారు. అలా రావాల్సిన అవసరం కూడా వాళ్లకుండదు. ఒక వ్యక్తి చేసే పని నీకు స్వార్థంలా కనిపిస్తే, అయిష్టం అన్పిస్తేనో దాన్ని మానుకోవాల్సిన అవసరం అతడికి ఉండదు.

ఒకప్పటి నీ ప్రియురాలు మరెవరితోనో తిరుగుతుంటే ఇంతగా పగతో, అసూయతో రగిలిపోతున్నావ్. ఒకవేళ నీకంటేముందే ఆమెకు ఇంకో ఫ్రెండ్ ఉంటే వాడు నిన్ను చూసీ సరిగ్గా ఇలానే రగిలిపోయి ఉండేవాడు. కాదా? కాదని నువ్వనుకుంటే అది 'ఆత్మవంచన' అవుతుంది. కేవలం నీతో పదిసార్లు పక్క పంచుకున్నందుకే ఇంతలా ఫీలయిపోతున్నావ్. మరి ఆమె భర్త మాటేమిటి? ఆమె భర్త స్థానంలో నువ్వూ, నీ స్థానంలో ఆమె భర్తా ఉంటే ఎలా స్పందించేవాడివో ఆలోచించు. నీమీద నీకు 'జాలి' పోతుంది. యదార్థమేంటో అవగతమవుతుంది. ఆలోచించగలిగితే ఆ స్థాయిలో ఆలోచించు. లేదా అస్సలా విషయం గురించే ఆలోచించడం మానేయ్.''

జ్ఞాన చక్షువును కప్పి ఉంచిన అహం, అసంతృప్తి, ఈర్ష్య ఈ మూడు అజ్ఞానపు పొరలు తొలగేసరికి అసలు నేనేమిటో, ప్రస్తుతం ఎలా ఉన్నానో, ఎలా ఉండకూడదో తెలిసింది. తెలిశాక ఇప్పుడాలోచిస్తే ప్రపంచమంతా మామూలుగానే ఉంది. కోపం, అసూయా లాంటి భావాలేవీ లేవు. ఏదో ఓ జీవిత సత్యం తెలుసుకున్నవాడిలా మనసు నిర్మలంగా ఉంది.

ఈ విషయం తెలీని నేను-నేనెలా ఆలోచిస్తానో ప్రపంచమంతా అదేవిధంగా ఆలోచించాలనీ, నాకేవి నచ్చుతాయో, నచ్చవో అందరికీ అలాగే ఉండాలనీ, అసలు ప్రపంచంలోని ప్రజలంతా నా అంత తెలివిగా ఎందుకు ఆలోచించడం లేదని మూర్ఖంగా అనుకునే ఓ-అజ్ఞానిని!

★

